సదాచారుఁడు

శతావధాని వేలూరి శివరామశాస్త్రి గారు

౧

ఇది దురాచార మని యెల్లరు వాదించినను మా పితృపితామహుల ఆచారమే సదాచారమని పట్టుపట్టి ప్రతీకుఁడు తన కుమారుఁడు నకులునకు పదమూఁడవయేట పెండ్లి చేసెను. పెండ్లికూఁతురు శుభాంగి నకులునికంటె ఒక రోజు చిన్నది.

ఆ మఱుసటియేటనే శుభాంగికి పుత్రుఁడు కలిగెను. వానికి నామకరణము చేయుటలో పితామహునకు, పితామహికి చాల వివాదము కలిగెను.

తన పేరే పెట్టవలయు నని ప్రతీకుఁడు; అది నాకు చెప్పరాని పేరు అని అతనిభార్య. ఇట్టి వివాదము, సంవాదము అయినపై తుదకు చంద్రుఁ డను పేరు ఖాయపడినది.

మూఁడు నెలల చంద్రుని శరీరము ఇపుడు అమ్మమ్మనాయనమ్మలు, మాతామహపితామహులు లోనగువారు చేయించిన నగల బరువు మోయుచున్నది. ఇఁక మేనమామ మాట చెప్పనక్కఱయే లేదు. అసలు బరువు ఆతనిదే. ఈ బిడ్డఁడు ఇంత బరువుమోయ పరలోకమునందు పుణ్యమే యున్నదో పాపమే యున్నదో కాని ఆ యున్న దేదో పుట్లకు పుట్లు ఉండి యుండవలయును.

ఊరివా రందఱకు అతఁడు బంగారు పిచ్చుక.

నకులునకు తనకుమారుని నలువురిలో చూడను, ఎత్తికొనను కడు సిగ్గు. కాని ఆతని యాత్మ కను లక్కఱలేకయే కాంచును. చేతు లక్కఱలేకయే ఎత్తికొనును.

చంద్రుని యాహారములు అనేక విధములు. తల్లిపాలు, దాదిపాలు, ఆలపాలు, వెన్న, మీఁగడ— ఇవి నీటు. కండెన్స్‌డ్ మిల్కు—బిస్కతులు లోనగునవి చాటు.

ఇతఁడు ఈ యాహారములచే, నగల బరువుచే ఇసుమంతయు పెరుఁగలేదు కాని తల్లిచూపులచే పెరిఁగెను; దాది చేతులలో వర్ధిల్లెను; తాతఅమ్మమ్మల పొడవుసాగెను; అమ్మమ్మ ముద్దులచే చిగిరించెను; తాత-ఉపలాలనములచే ఒడలుచేసెను.

అతని ఆహారము వయసుతోపాటు వృద్ధియాయెను: అన్నము, పప్పు, కూరలు, పచ్చళ్లు, నేయి-ఇత్యాదులు.

ఇవన్నియు చంద్రుని జీర్ణకోశమును విశాలపఱచినవి. ఒండొండ పోరు లేకుండ ఇవన్నియు ఒకచోట నివాస ముండవలయుఁ గదా! మేఘములు పరవళ్లు త్రొక్కుటకు ఆకాశము ఎంతవిశాలమై యుండవలెను?

ఈ యాహారము లన్నియు ఒక అతిథిని తెచ్చెను. ఆతని కాంచినది మొదలు చంద్రుఁ

డు కనులు మూసికొని పరుండును. ఈ యతిథి ఉన్నంతవఱకు ఆహారము లన్నియు చేతులు, మూతులు కట్టుకొని నిలువఁబడి పోవును. లోపల నున్న పదార్థము లన్నియు చిఱుతపులి నోటిలోనికి తానుగా నేఁగు గుఱ్ఱమువలె ఆ యతిథినోటిలోని కేఁగును. అతఁ డెల్లప్పుడు అగ్రస్థాన మాక్రమించును. ఏలయనిన అతఁడు ఈశ్వరాంశసంభూతుఁడు. సుగృహీతనామధేయుఁ డగు అతనిపేరు జ్వర భట్టారకుఁడు. అతఁడు పది పదియేను నాళ్లు ఉండి బట్టా, పాతా పుచ్చుకొని మరి వెళ్లును.

ఇతని ఆసగా చూచుకొని భూతములు రాఁదొడఁగెను. గ్రామమున బలవన్మరణము, అకాలమరణము చెందినవా రందఱు దయ్యములై వారి యింటనే తిష్ఠ. ఏ యతిథులు వచ్చినను వారియింటనే విందు. పరగృహము లకుఁ బోవు అతిథులను గూడ వారు తమ యింటికే ఆహ్వానించి అర్ఘ్యపాద్యము లిత్తురు. ఆ యా యతిథులు సంపూర్ణసత్కారములను పొంది పోవుచుందురు. ఒకరి తరువాత ఇంకొకరు మఱల సత్కారము గొనవచ్చుచుందురు. వారు కేవలము సత్కారము గొని నిష్క్రమించుట లేదు. అతనికి బంగారు తాయెత్తులు సత్కరించి మరి పోవుచుండిరి. ఆ తాయెత్తు లన్నియు ఇదివఱ కుండిన నగలు పెట్టిన పిల్లల వలె నుండెను.

చంద్రుని కిపుడు ఏడేండ్లు. ఆతని శరీరము రాతిని భేదించుకొని వచ్చిన మొలకవలె నుండెను. ఇపు డాతని యాహారమును వివరించుచో నతని తలిదండ్రులు, విశేషించి ప్రతీకుఁడు శపించును. కథయంతయు తినుబండా లపు బండాల మగును. కాన లఘువుగా తేల్చెదను—నాలుగు గుర్రముల బలముగల ఒక మరను అతని ఉదరమున పెట్టవలయును.

చంద్రుని మోము ఎల్లపుడు ఆలోచన గ్రస్తమయియుండును. ఈ నగలబరు వెటులు మోయుదును? ఈ వస్త్రముల నెటులు ధరింతును? ఈ తాయెత్తులను ఎటులు ఒత్తుకొన కుండఁ జేసికొందును? ఈ మొదలయిన వెన్నియో కలిసి ఆ చింత చింతకాయలు కట్టుకొని పోయినది ఆ చింతకాయ లన్నింటిలోను రోగబీజములు.

ప్రతీకుఁడు శుష్కవేదపాఠకుఁడు మాత్రమే కాదు; మంచి అనుభవవైద్యుఁడని పేరు మోసినవాఁడు. అతనికి చేవ్రాలుపెట్ట చేత కాకున్నను అతనిచేతిలో వ్రాలుమాత్రము దొడ్డవని పెద్దప్రథ. నిదానము చదువుకొనకున్నను అతనికి నిదాన మెక్కువ. అతఁడు మందులు ఎక్కువ ఉంచుకొనలేఁడు; ఎక్కువ ఏదీ పనికిరాదని ఆతనికడ మూడేమందులు:నల్లమందు, ఎఱ్ఱమందు,మూఁడవ పరమౌషధము లంఘనము. రోగముల జాతు లన్నియు ఈమూఁటికే విభజింపఁబడి యుండెను. అతఁడు ధనమీయని వారికి ముఖ్యముగా ఈ మూఁడవమందే వాడును. అతఁడు నడుమ నడుమ వేదమునుండి కారికలుచదువును. 'అజా మేకాం లోహిత

(శుక్ల) కృష్ణామ్' గ్రామవైద్య మంతయు అతనిమీఁదనే జరుగుచుండెను గాని ప్రకృతము ఆ పల్లెటూరు కూడ బస్తీనుండి ఇంగ్లీషు వైద్యులను రావించుకొనుచుండెను.

ప్రతీకుఁడు తనను బిల్చువారికడ ఆయుర్వేదమాహాత్మ్యమును, చరకుఁడు సుశ్రుతుఁడు మొదలగువారు ధన్వంతరికి అపరావతారములని వేదమునుండి కొన్ని వాక్యములను ఉదాహరించుచుండును.

ప్రతీకుఁడు పథ్యము నిర్మించుటలో అసమానుఁడు. ఆ పథ్యమువలన రక్తమాంసములెన్నటికిని వృద్ధియయి ఆధిక్యదోషమును చేయవు.

చంద్రునకుమాత్రము 'ప్రతీకుఁడు తాత' యని యైనను అతని మందునెడ ప్రీతి లేదు. పెరటిచెట్టు మందుకు రాదు. ప్రతీకుఁడు మందీయఁగనే చంద్రుఁడు రివ్వున ముఖము కేసి విసురుకొనువాఁడు. ఆ మందు నోటిలోనికి పోయెనో జుట్టులోనికే పోయెనో ఇవన్నియు దాఁటి పెరటిలోనికే పోయెనో తెలిసికొనుట చాల కష్టము.

౨

ప్రతీకునింట సదాచారుఁడు అనువాఁడు ఒకఁడు కలఁడు.

సదాచారుఁడు మొదట మొదట సత్ ఆచారుఁడు. పిదప సదా ఆచారుఁడు.

ఈ సదాచారుఁడు ప్రతి ద్వీపములో ప్రతి జాతిలో ప్రతి సంఘములో ప్రతి మనుష్యునిలో ఒకొక్క-రీతిగాపుట్టి ఒకొక్క-రీతిగా మాఱి తర్క-మును అవహేలచేసి విశ్వాససింహాసనమెక్కి- శాసించుచున్నాఁడు. అతనికి దరిద్రుఁడును మహారాజును ఒకటే. అతని శాసనమున దయయు, కోపము ఒక్క-టియే. దానికి ఇనుమును వెన్నవలె కరఁగును; మోడును చిగుర్చును.

అతనిని కొందఱు మొద వందురు. మరి కొందఱు ఆవుమొగపు పులి యందురు. కొంద ఱతనిని మొదట మొదట కప్ప యందురు; ఇపు డిపుడు కప్పకూఁత పామందురు.

మహానదుల మూలమైన తెలియును గాని సదాచారుని ఆనుపాను లెవరికిని తెలియవు. ఇతఁ డెపుడు పుట్టెను? ఎక్క-డ పుట్టెను? అను శంకయే యింతవఱకు ఎవరికిని తట్టలేదు.

ఇతఁడు పురాణబాలకుఁడు. స్మృతులు ఈ వృద్ధకుమారుని దేశకాలానుగుణముగా పెంచినవి. ఇతనికి స్మృతులు తల్లియగుచో వేదము తండ్రి. ఇతఁ డెంత పురాణబాలకుఁడో అంత నిత్యయౌవనుఁడు.

మహానదిలో అనేక-ఉపనదులు వచ్చి కలిసినట్లు సదాచారునిలో అనేక-ఇతరాచారములు వచ్చి కలిసెను. ఉపనదులు సంగమించిన తావులలో నీరు వేఱువేఱుగ కానిపించుచునే యుండునుగాని పోనుపోను ఆ జడచిక్కు- విడఁదీయుట చాలచిక్కు-.

ఏకాలమున అర్థవాదములే యథార్థవాదము లాయెనో, ఏకాలమున భీతులే

దేవతలాయెనో, ఏకాలము సర్వమును అదృష్టముమీఁదనే పట్టుకొని నిలిపియుంచెనో, ఆ కాలమున ఈ యితరాచారములు సదాచారమున కలగాపులగ మయిపోయెను.

సదాచారుఁడు పిల్లికాని, విధవకాని యెదురాయెనా వెనుకకు పోవును. తుమ్మునచో లోలోపల తిట్టుకొని కార్యమారంభింపఁడు గూబ అఱచుచో ఎవరో చత్తురని శంకించును.

ఆదివారమునాఁడు ఉసిరికాయ పచ్చడి తినరాదనును. మంగళ శుక్రవారములలో ఇతరులకు దమ్మిడీయైనను ఈయఁడు. శని సోమలలో తూర్పునకు, గురువారమున దక్షిణమునకు, ఆదిశుక్రలలో పడమటికి, బుధమంగళలలో ఉత్తరమునకు వెళ్లనీయఁడు. బుధవారమునాఁడు పులినేని బయలుదేరనీయఁడు. ప్రతి శనివారమునాఁటి ప్రాతఃకాలము పాపకాలము. మంగళవారమునాఁడు తాటాకులపాక కుట్టనీయఁడు. వైదికునిచే నియోగి యింటి పాకము తినిపింపఁడు.

అతని శాసనము చాల క్రూరము. ఏ యవయవము దోషము చేయునో ఆ యవయవమును ఖండించును! యజ్ఞము చేయువానికి వేదము రానిచో దానికి పశువును చంపుట శిక్ష.

ఇట్టివి పెక్కులు సదాచారునికి ఎడమ చేయి. అతని కుడిచేయి సుశీతలము. అది బహిరుష్ణము,అంత శ్శీతము.ఆ హస్తమునందలి రేఖలు ఏ పురుషునకును లేవు.

ఈ సదాచారుఁడు తన కుడి యెడమ చేతుల నడుమ ప్రతీకుని కౌఁగిలించుకొనెను. ప్రతీకుఁడు ఎక్కువ ఎడమచేతి పట్టులోనే యుండెను.

సదాచారుని కన్నులు మూసి దురాచారుఁడు ఆ యింట ప్రవేశింపక పోలేదు. పాల నెపముతో తేనీరు కాఫీలు చంద్రుని లోనికి జాఱుచుండెను. వెన్నయను పేర బిస్కతులు చాకొలేట్. ఇంగ్లీషు మందుకాని ఇంగ్లీషు మాటకానిఇంతవఱకు ప్రతీకునిజాగరూకతచేత ఆ ప్రదేశమును తొంగియైన చూడలేదు.

ఇరుగు పొరుగు పిల్లలను, ముఖ్యముగా విశ్వంభరుని జూచి తల్లి శుభాంగి చంద్రునకు క్రాపింగు పెట్టించెను. ప్రతీకుఁడు ముమ్మాఱు శిరోముండనము చేయించి మరి విడిచెను. దానితో కూఁకటికూడ కూయిడెను.

ప్రతీకుఁడు నకులునితో ఒకనాఁడు ఇట్లనెను—'చంద్రుని మెడ చిన్నఁబోయినది.'చిన్నఁబోవుటో పెద్దబోవుటో నకులునకు తోఁపలేదు. ప్రతీకుఁడు—'ఏడేండ్లు నిండినవి. గర్భాష్టమములలో ఉపనయనము చేయవలెను' అనెను.—'వాఁడనలే జబ్బువాఁడు, ప్రొద్దుననే స్నానము చేయవలెను; జందెము బుజమెక్కనుమాటయేకాని సంధ్యావందనమా, చట్టుబండలా?' అని నకులుఁడనెను.—'నాకు ఆ యేటనే ఐనది. నీకు ఆ యేటనే చేసితిని. వానికిని ఈ యేటనేకావలయును. ఇందులకు పూర్వాచారము పరిత్యజింతుమా?' అని ప్రతీకుఁడనెను.

వాద ప్రతివాదములు అయినవి. ప్రతీకుని మాటయే మంత్రమైనది. చంద్రునకు వడుగు అయినది.

చంద్రుఁడు ప్రొద్దుననే స్నానము చేయును. ప్రతీకుఁడు సంధ్యావందనము చెప్పును. చంద్రుఁడు 'దానికర్థమేమి? దీనికర్థమేమి?' అని యడుగును. ప్రతీకుఁడు 'వచ్చినతరువాత చెప్పెదనులే' అనును.

చంద్రునకు సంధ్యావందనము ఎన్నాళ్లకును రాలేదు. అతఁడు ఊరిలో నున్నవారి నందఱను అర్థ మడుగును. తమకు అర్థము వచ్చినటులు ఎవరును చెప్పలేదు. చంద్రునకు విసువు కలిగెను.

ఒకనాఁడు ప్రతీకుఁడు మనుమని దండించెను. 'నాకు అర్థము చెప్పనిది రాదు' అని చంద్రుఁడు అనెను. 'మే మందఱము ఇటులే చెప్పికొంటిమి. మీ నాయనయు ఇటులే చెప్పికొనెను. నీవును ఇటులే చెప్పుకొనవలయును. ఊఁ, చెప్పుకొనుము.'

ప్రతీకుఁడు ఇటు లనినంతనే చంద్రుఁడు సంధ్యావందన మంతయు గడగడ ఏకరువు పెట్టెను. ప్రతీకుఁడు పరవశుఁడై 'ఇఁక నీకు వేదము మొదలుపెట్ట వచ్చును' అనెను. చంద్రుఁడు—'దానికి అర్థ మున్నదా?' అని అడిగెను. 'ఎక్కడి పిల్లఁడవురా? వేదమునకు అర్థ మేవిటిరా?' అని ప్రతీకుఁ డనెను 'అట్లగుచో నేను చెప్పుకోను' అని చంద్రుఁ డనెను. ప్రతీకుఁడు—'వట్టీ కలికాలము, వట్టీ కలికాలము' అనుకొని పిదప 'భట్టవల్లిలో వారములు చేసి వేదము చదువుకొందువా?' అనెను. 'విశ్వంభరుఁడు అమలాపురములో చక్కగా కాపురము పెట్టి ఇంగ్లీషుచదువుకొనుట యేమి? నేను వారములు చేసికొని అర్థములేని వేదము వల్లించుట యేమి?' అని చంద్రుఁ డనెను. 'ఓరి అభాగ్యుఁడా! మాలలలో కలిసెదవా? చూడు రేపటినుండి చితుకవేసి సంత చెప్పెదను' అని ప్రతీకుఁడు గదమాయించెను.

చంద్రుఁడు అతనివద్దనుండి లేచిపోయెను. ఎక్కడెక్కడనో తిరిగి తిరిగి యింటికి వచ్చుసరికి రాత్రి ఆయెను. అతఁడు రాత్రి అన్నము తినలేదు.

నాయనమ్మ బతిమాలుకొనెను. తల్లి బతిమాలుకొనెను. తండ్రి ఉపలాలించెను. అతఁడు అన్నము తినలేదు.

తుదకు ప్రతీకుఁడు కోరచూపులు చూచుచు—'వెఱ్ఱివెఱ్ఱి కళలు! అందఱు బతిమాలుచుండఁగా రెచ్చి పోయితివి! లే! లేచి సంధ్యావందనము చేసికొని రెండు మెతుకులు తిను' మని గద్దరించెను.

చంద్రుఁడు ముసుఁగు పెట్టుకొని పడుకొనెను. ప్రతీకుఁడు రెండు కొట్టి సంధ్యావందనమునకు కూర్చుండఁ బెట్టెను.

'నాకు జ్వరము తగిలినది. నేను సంధ్యావందనము చేయలేను' అని చంద్రుఁ డనెను.

ప్రతీకుఁడు చేయిచూచెను. 'నీకు దొంగ జ్వరము; రెండు తన్నుచో పోవును' అని భయపెట్టుచు వెళ్లిపోయెను.

3

ఆ మఱునటి ప్రొద్దున ఉసురుసురు మనుచు ఒక అతిథి చంద్రునింటికి వచ్చెను. వెంటనే చంద్రుఁడు అభ్యుత్థానము, అభివాదనముచేసి అర్ఘ్యపాద్యము లిచ్చి ప్రాణమును బిగఁబట్టుకొనెను. ఆ యతిథి అతి పరిచితుఁడగు జ్వర భట్టారకుఁడే.

అతని వెనువెంటనే దయ్యములు, భూతములు ఒకటొకటిగా వచ్చెను.

ప్రతీకుఁడు చేయి చూడవచ్చెను. చంద్రుఁడు చేయి ఈయలేదు.

ప్రతీకుని మనస్సు ద్రవించెను. 'రాత్రి నేనుదొంగజ్వరమంటినే' యని నొచ్చుకొనెను. కన్నుల నీరు తెచ్చుకొని చంద్రుని ఉపలాలించెను కాని అతఁడు చేయి చాఁపలేదు. ప్రతీకుఁడు ఒడలిపై చేయివైచి ఎంతోసే పుంచలేకపోయెను. అతఁడు పరికించి పరికించి మశూచిగా నిర్ణయించెను.

చంద్రునకు ఆ రేయి నిదుర లేదు. తలనొప్పి తోపాటు దప్పి యొకటి. ఆ రాత్రి యెట్టులో కడచెను.

మఱునాఁడు చంద్రుఁడు—విశ్వంభరుని యింటికి మామూలుగా వచ్చు ఇంగ్లీషువైద్యుని తీసికొనిరమ్మని తల్లితో పోరు పెట్టెను. శుభాంగి నోరిమీఁద చేయివైచికొని యూరకుండెనుగాని చాటుచాటుగా తనఅన్న జటావల్లభునితో కబురుపంపు ప్రయత్న మొనరించెను.

అమలాపురమున వైద్యముచేయు టన్న ఆయుర్వేదవిశారద బిరుదాంచితుఁ డగు రామశాస్త్రిని తీసికొని రావలయునని నకులున కున్నదికాని తండ్రినిచూచి జంకు.

గృహావైద్యము విడిచి అన్యవైద్యము తలఁచుటయే ఓగాత్యము. అందులో నగర వైద్యమా? తనకు అటువంటి ఉద్దేశము కలుగుటయే అమంగళమని అతఁ డనుకొన్నాఁడు.

ప్రతీకుఁడు ఎట్లో కష్టపడి చేయిచూచెను. అతనికి కాళ్లాడలేదు. కర్మవిపాకము తిరుగవేయించెను. నూవులు, పూవులు, కుంకుమము, రాంకవము మొదలగువానిని తెప్పించి దానముచేసి ఇఁక తగ్గిపోవచ్చునని అనుకొనెను.

ముదుసండ్రు ప్రతీకునకు మరియొక విధముగా తోడుపడకుండ ఊరక కూరుచుండలేదు. సోదె చెప్పించిరి. సోదె చెప్పినదానికి ఒక చీరయు, ఒక రైకయు, దాని కొడుకునకు లాగుగుడ్డ రుమాలును ఇచ్చిరి. కోడిపిల్లను దిగదుడిపించి పొలిమేరలో పాఱవేయఁ బంపిరి. అచట పాఱవైవఁ బంపఁబడినవాఁడే దాని నింటికి తీసికొని వెళ్లెను. మంచము చుట్టును కల్లు సురాళింపించి పాఱఁబోయించిరి.

ఈ యుపచారములకు జ్వరభట్టారకుఁడు ఉబలాటపడలేదు. అతని త్రోవ అతనిదే వాని త్రోవ వానిదే.

'ఇది లోపలిపోఁత. అమ్మవారు దాఁగియున్నది. ధూపదీపనైవేద్యము లీయవలెను,

అని ప్రతీకుఁ డనుచుండఁగా చంద్రుఁడు 'నాకు ఇంగ్లీషు మందు కావలెను. అర్థమున్న మందు కావలెను. నేను దాఁగలేదు. బయటనే ఉన్నాను' అనెను.

ఇది సంధిజ్వరముకాని అమ్మవారు కాదని అమ్మలక్కలు అడిపోసిరి. ఇంటిల్లిపాది ఆ మాటనే నిర్ధారించిరి. తుదకు ప్రతీకుఁడు కూడ అటులే అభిప్రాయపడెను.

ప్రతీకుఁడు చేయి చూడఁబోవుచుండఁగా ఎవరో తుమ్మిరి. అతఁడు పిఱికిమొగముతో చేయి విడిచిపెట్టి వాకిటికి వెళ్లెను.

'రోగమే తుమ్మినది. అసలు తుమ్ములకే మందు తాతను కొంచెము అవలికి వెళ్లమని విశ్వంభరునిగారి యింటికి వచ్చు ఇంగ్లీషు వైద్యుని తీసికొని రం'డని చంద్రుఁ డనెను.

వాకిట పచారు చేసి కొంచెము కాలను దాఁటిన పిదప ప్రతీకుఁడు లోనికి వచ్చి రోగి చేయి చూడఁబోయి సందేహించెను. వెంటనే పంచాంగము చూచెను 'వర్జ్యము వర్జ్య'మను కొనుచు మంచము ప్రక్క కూరుచుండెను.

'జ్వరమునకు వర్జ్యమూ లేదు. తాతకు మతీలేదు' అని చంద్రుఁ డనెను ఆమాటలలో ప్రతీకుని కేదో సత్యము ఉన్నటులు గోచరించెను. అతఁడు తెల్లబోయి కూరుచుండెను.

ఆ సమయముననే జటావల్లభుఁడు ఇంగ్లీషువైద్యుని ఎవరికిని తెలియకుండ తీసికొని వచ్చెను. అంత హఠాత్తుగా ప్రవేశించిన ఆ దురాచారమును సాహసించి ప్రతీకుఁడు ప్రతిఘటింప లేకపోయెను. అతఁడు సహింపలేక నోరు తెఱచెను. అందు విధవలు, ఒంటిబ్రాహ్మణులు, తుమ్ములు, కాకులు, గూబలు మొదలగునవి కానిపించెను.

అతనిని చూచినంతటనే చంద్రుఁడు లేచి కూరుచుండెను. వైద్యుఁడు పరీక్షించి మందిచ్చి వెళ్లిపోయెను.

ఆ మఱునాఁడు రోగనిదానము విషయమున, ప్రతీకునకును ఇంగ్లీషు వైద్యునకును నిదానముగా వివాదము జరిగెను.

ఆ వివాదము సంశయము చంద్రుఁడు వినెను. ఆ మఱునాఁడు చంద్రునకు మరికొంచె మెక్కువ చేసెను. ప్రతీకుఁడు మందు ఈయఁగా చంద్రుఁడు ఆ మందులను అతని మీఁదనే పాఱవైచెను. ప్రతీకుఁడు ఇంటిలోనికి పోయి ముడుపులు కట్టెను. చంద్రుఁడు లోలోపల ఇంగ్లీషుచదువు మీఁద ముడుపు కట్టుకొనెను.

సెలవులు కావున విశ్వంభరుఁడు స్వగ్రామమునకు వచ్చెను. వచ్చినవెంటనే బాల్యమిత్రుని చంద్రుని చూడవచ్చెను. చంద్రుఁడు అంతజ్వరములోను లేచి కూర్చుండి—'ఏ క్లాసు చదువుచున్నావు? మీకు పాఠాలకు అర్థములు చెప్పెదరా? తాత నాకు అర్థము తెలియని వేదము చెప్పెదనని పట్టు పట్టినాఁడు. నేను మీ యింటిలోనుండి చదివికొందును. నన్నుఁగూడ తీసికొని పోదువా? బియ్యము మా అమ్మ నడిగి తెచ్చెదను లే. ఇంగ్లీషు బడిలో పడనిది నాకు ఈ జ్వరము నెమ్మ

దింపదు' అనెను. విశ్వంభరుఁడు 'నిన్ను తప్పకుండ తీసికొని వెళ్లెదను' అనెను.

'కొంప తవ్వి బిగ్గరగా అనకుము. మా తాతవి పాముచెవులు' అని మంచముపై పడి పోయెను. ఈమాట లన్నియు వినుచుండిన వైద్యుఁడు ఉపచారములు చేసి మందు లిచ్చెను. చంద్రుఁడు కొంచెము కుదుటఁబడెను.

ఈ సంగతి ఇంటిల్లి పాది వినిరి. తలిదండ్రు లింగ్లీషు చదువు ఒప్పుకొనిరి. తుదకు ప్రతీకుని చేఁగూడ వైద్యుఁడు ను, వ్యాధియు ఒప్పించెను.

చంద్రునకు క్రమక్రమముగా ఆరోగ్యము కలిగెను. ఆరోగ్యము కలిగిన వెంటనే చేసిన పని యేమనఁగా విశ్వంభరుని సాహాయ్యకమున తాతగారి ఎఱ్ఱమందులు, నల్ల మందులు నేలలో పాఁతర వేసెను. మూఁడవమందును మాత్రము ఏమియు చేయలేకపోయెను.

ప్రతీకుఁడు చేయునది లేక చూచుచుండఁగా కొలఁది రోజులకే చంద్రుఁడు విశ్వంభరునితో అమలాపురము వెళ్లెను.

మగనలాలు మృతినిగూర్చి మహాత్ముని విచారము

ముడుంబ నరసింహాచార్యులు గారు

(మంజరీ గేయము)

అకట ! నా స-ర్వస్వమునకును
హక్కు-దారుడు-గాగ నెవ్వరి
నెంచితినో, యా-మగనలాల్ నా
కింక కఱవయ్యె.

మదిని నాకపు-డపుడు తోచెడి
మంచియూహలు-వినుచు తడవుగ
కార్యరూపము-దాల్ప జేసెడు
కర్మఠుడు వోయె.

నన్ను విడువగ-నొల్ల కిరువది
నాలుగేండ్లును-దోడి నీడై
వర్తిలిన నా-యన్న కొమరుని
మూర్తి నను వీడె.

కన్నులుగ, నా-కాలు సేతులు
గనగ, నిచ్చలు-నుపకరించిన
యీడులేని, శు-భాంగకల్పుం
డింక లేడయ్యె.